క్లుప్తంగా

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



తెనాలిటౌన్: పట్టణంలోని గాంధీ నగర్‌లో యోగా సభ్యులు ఎం.గురవయ్య నివాసంలో శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యోగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కఠెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు శిక్షణ ద్వారా యోగా, ప్రాణాయామం, ధ్యానంచేస్తూ.. ఆరోగ్యవంతులు కావాలని కోరారు. ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, పిల్లలు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనూష, జగదీశ్వరి, తేజ, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

ఉప్పు బజారులో చలివేంద్రం ఏర్పాటు



తెనాలిటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాలు సయుక్తంగా గురువారం ఉప్పు బజార్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాయి. ఆర్య వైశ్య లీగల్ సెల్ వైస్ చైర్మన్ గ్రంధి జయరామకృష్ణ చలివేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు అప్పల కిషోర్, కొత్తమాసు గురునాథ బాబు, ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం, ఆర్య వైశ్య మహా సభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్, తూనుగుంట్ల సుబ్బారావు, అచ్యుత సాంబ శివరావు, కూరపాటి రవికుమార్, ఉప్పల వరద రాజులు, తిరుమలరావు, వేమా సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

30న బ్రహ్మంగారి 330వ ఆరాధన



తెనాలి: జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధన గురు పూజా మహోత్సవం ఈ నెల 30న పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించనున్నారు. తెనాలి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు గురువారం ఆలయంలో సంఘ పతాకాన్ని ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. మహోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్టు తెలిపారు. సంఘం అధ్యక్షుడు గుంటముక్కల వెంకట నాగార్జున, ప్రధాన కార్యదర్శి కడియం శేషుబాబు, కోశాధికారి తుమపాల లక్ష్మీప్రసాదరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భద్రాచల రామదాసు కీర్తనల ఆలాపన



తెనాలిటౌన్: పట్టణ తులసీరామ్‌చౌక్‌లోని రామ మందిరంలో రాముల వారి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం భద్రాచల రామదాసు కీర్తనలను లక్ష్మీ సునీత బృందం సభ్యులు ఆలపించారు. రామ మందిరంలో పూజలు జరిపారు. ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓం శక్తి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

కర్లపాలెం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం కర్లపాలెంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించి, బ్రోచర్లు అందజేశారు. చింతాయపాలెం, ఏట్రవారిపాలెం, పేరలి, యాజలి, తుమ్మలపల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమం జరిగింది. కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ ఆలీ, ఉప సర్పంచ్ పఠాన్, సచివాలయాల కన్వీనర్ షంషీర్, వార్డు మెంబరు జానీ, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ

పిట్టలవానిపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ కె.పద్మజ మాట్లాడుతూ.. భవనంవారి పాలెం, ఖాజీపాలెం, గోకరాజు నల్లిబోయినవారి పాలెం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేసి, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీసీత



హాస్టల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్జి శ్రీసీత

తెనాలిరూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.శ్రీ సీత విద్యార్థులకు సూచించారు. స్థానిక కొత్త పేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, గురుకుల పాఠశాలను న్యాయమూర్తి గురువారం తనిఖీ చేశారు. అక్కడ కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన శాల, వాషింగ్ ప్రాంతాన్ని సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని న్యాయమూర్తి రుచి చూశారు. వేసవి సెలవులు పూర్తయ్యి.. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేనాటికి అన్ని మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగంపై అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి సరైన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ జి.శైలజ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ జయప్రద, గురుకుల వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనంద్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది సరళ, యర్రంశెట్టి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వివాహం..



నూతన దంపతులకు తాళిబొట్టు, వస్త్రాలు, నగదు అందజేస్తున్న మురళి తదితరులు

తెనాలిరూరల్: తెనాలి శివారు జేఎంజే కాలేజీ సమీపంలోని స్వధార్ కేంద్రం అనాథలైన ఎంతో మంది బాలికలకు, యువతులకు ఆశ్రయం కల్పిస్తోంది. జేఎంజే సంస్థల ఆధ్వర్యంలో దాదాపు 15 ఏళ్లుగా ఇక్కడ స్వధార్ కేంద్రం నిర్వహిస్తున్నారు. వివిధ కారణాలతో అయినవారికి దూరమైన బాలికలు, యువతులు ఇక్కడ ఆశ్రయం పొందుతుంటారు. సంరక్షణతో పాటు స్వధార్ కేంద్రం నిర్వాహకులే ఇక్కడి యువతులకు మంచి సంబంధాలు చూసి, వివాహం చేయిస్తున్నారు. చిన్నతనంలోనే స్వధార్ కేంద్రానికి వచ్చి చేరిన మేరీ మానస అనే యువతికి ఓ మంచి సంబంధం చూసి వివాహం నిశ్చయించారు. ఒంగోలుకు చెందిన మణికంఠ అనే యువకుడితో వివాహం కుదిర్చి గురువారం నిశ్చయ తాంబూలాల వేడుక ఎంతో ఘనంగా జరిపారు. ఇందుకు స్వధార్ కేంద్రం సిస్టర్స్ దాతల సహకారం తీసుకున్నారు. అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ యువతి వివాహ బాధ్యతను తీసుకున్నారు. పెళ్లికి కావాల్సిన వస్తు సామగ్రితో పాటు మంగళసూత్రం, ఐదు పట్టు చీరలు, రూ.10 వేల నగదు అందజేశారు. నిశ్చితార్థ వేదిక మీద స్వధార్ నిర్వాహకులతో కలిసి యువతి మేరీ మానసకు వాటిని అందించి ఆశీర్వదించారు. త్వరలో ఇక్కడే ఉంటున్న ఎస్తేర్ అనే యువతికి వివాహం జరుగనుండగా ఆమెకు కూడా మంగళ సూత్రం, ఐదు పట్టు చీరలు, రూ.10 వేల నగదును అందజేశారు. మేరీ మానస, మనికంఠల వివాహం మే 12న యువకుడి స్వస్థలం ఒంగోలులో జరుగుతుందని స్వధార్ కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, కాకుమాను రాంబాబు, స్వధార్ ఇన్‌చార్జ్ హృదయమేరి, థెరిస్సా, జేఎంజే ప్రిన్సిపల్ షైనీ, జేఎంజే గ్లోబల్ హెచ్‌ఎం మారిస్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అక్రమ నిర్మాణంపై ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినపతిపత్రం అందజేస్తున్న ఈమని గ్రామస్తులు

తెనాలి: దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలో ఆలయ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పలువురు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని బహిర్భూమిని ఆక్రమించి ఉయ్యూరు వారి దేవర రేణుకమ్మ గుడిని నిర్మిస్తున్నట్టు గతేడాది డిసెంబరు 13న రిజిస్టరు పోస్టు ద్వారా సబ్ కలెక్టర్ కార్యాలయానికి, జిల్లా కలెక్టరుకు తెలియజేసినట్టు గుర్తుచేశారు. వాముల దొడ్డికి వెళ్లే రోడ్డును ఆక్రమించి, గుడి నిర్మాణం చేస్తున్నారని కొందరు రైతులు కోర్టుకు వెళ్లగా, కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు. అయినప్పటికీ గుడి నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ గుడి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి సమాచార హక్కు చట్టం ప్రకారం సమాధానం ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై సదరు నిర్మాణం చేస్తున్న వారు తమను చంపుతామని కూడా బెదిరించారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణాన్ని నిలుపుదల చేయించి, పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేసిన వారిలో బండి శ్రీనివాస రావు, బండి రామారావు, బి.ఏడుకొండలు, వై.గోపి పలువురు మహిళలు ఉన్నారు.

ఘనంగా బండ్లమ్మ తిరునాళ్ల ఏర్పాట్లు

- వచ్చే నెల 3 నుంచి ప్రారంభం



లభ్యమైన అమ్మవారి పురాతన ఆభరణాలు



ఆభరణాల అలంకరణలో అమ్మవారు(ఫైల్)

చందోలు(పిట్టలవానిపాలెం) : అమ్మలగన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆది పరాశక్తి ఆ అమ్మ ప్రతి రూపమేనని భక్తుల ప్రగాఢ నమ్మకం. బావిలో విగ్రహం దొరకగా దేవాలయం నిర్మాణంలో అమ్మవారి ఆభరణాలు దొరకటంతో ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది ఇక్కడ మొక్కులు తీర్చుకున్న వారికి అమ్మవారు కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల విశ్వాసం. మహిమ గల బండ్లమ్మ వారి తిరునాళ్ల మే నెల 3నుంచి 7వ తేదీ వరకు అంగరరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మవారు వెలిశారు. క్రీ.శ 11వ శతాబ్దంలో చందోలు ప్రాంతాన్ని పాలిస్తున్న చోళరాజు ఈ ప్రాంతంలో బండ్లతో నిండుగా రాళ్లను తెప్పించి శివాలయం నిర్మించాలని తలపెట్టారు. అప్పుడు.. ప్రస్తుతం అమ్మవారు దేవాలయం ఉన్న చోట బండ్లు నిలిచిపోయాయి. దీంతో పండితులను పిలిపించి ఇందుకు గల కారణం తెలపాలని అడుగగా.. బండ్లు ఆగిన ప్రాంతంలో గ్రామాన్ని రక్షించే గ్రామ దేవత కొలువై ఉందని, ఆ దేవతకు దేవాలయం నిర్మించాలని చోళరాజుకు వివరించారు. అమ్మ విగ్రహం కోసం తవ్వకం జరిపిన కందకంలో జలం వెలువడగా.. దానిని బావిగా కట్టించారు. ఆ బావి బండ్లమ్మ బావిగా ప్రసిద్ధి చెందింది. అదే బావిలో అమ్మవారి విగ్రహం లభించింది. ఒక సమయాన కొందరు వ్యాపారులు ఈ దారి వెంట సరుకులు నిండిన బండ్లతో వ్యాపారానికి వెళ్తుండగా.. వారి బండ్లపై నిండు "జవ్వని"గా అమ్మ సాక్షాత్కరించటంతో బండ్లమ్మ అమ్మవారిగా ప్రసిద్ధి చెందారు.

2002లో ఆభరణాలు దొరికాయి ఇలా..

2002లో బండ్లమ్మ దేవాలయ ముఖ మండప నిర్మాణానికి పునాదులు తవ్వుతుండగా.. కేజీ 467 గ్రాములు కలిగిన అమ్మవారి బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. ఈ ఆభరణాల్లో అమ్మవారి వడ్డాణం, కమ్మలు, చెవి దిద్దులు, హారం, ముక్కు పుడక, మంగళ సూత్రాలు, కను బొమ్మలు ఉన్నాయి. అప్పట్లో ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నగలు అమ్మవారికి చెందాలని భక్తులు, ప్రభుత్వానికి చెందాలని పురావస్తు అధికారుల మధ్య వాదనలు తలెత్తాయి. ఈ వివాదం కోర్టుకు కూడా వెళ్లింది. ఆభరణాలను అప్పట్లో కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, దేవాదాయ, పంచాయతీ, గ్రామస్తులు కలసి చందోలు ఎస్‌బీఐలో భద్రపరచడం జరిగింది. ఏటా నిర్వహించే బండ్లమ్మ వారి తిరునాళ్ల లో ఒక రోజున కోర్టు అనుమతితో రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖలు, గ్రామ ప్రజల సమక్షంలో బ్యాంకులోని నగలను తీసుకొచ్చి.. అమ్మవారికి అలంకరించడం జరుగుతుంది. వచ్చే నెల 3న అఖండ జ్యోతితో అమ్మవారి తిరునాళ్ల ప్రారంభించి, తవ్వకాల్లో లభించిన బంగారు ఆభరణాలతో 6న అలంకరణ గావించి, సాయంత్రానికి మరలా బ్యాంకులో నగలు డిపాజిట్ చేస్తారు. ఆభరణాల అలంకరణ సమయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్రంలోని నలు మూలల నుంచి వస్తుంటారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన బందోబస్తును పోలీసు శాఖ కల్పించనుంది.

గ్రామ సచివాలయం సందర్శన

పెనుమర్రు(వేమూరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ గ్రామ సచివాలయం సిబ్బంది అందజేయాలని మండల ప్రత్యేకాధికారి జె.రాజవర్ధన రావు పేర్కొన్నారు. పెనుమర్రు గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. సిబ్బంది సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, శ్రీనివాసరావు, సువర్ణరావు, వీఆర్వో జితేంద్ర పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తెనాలిటౌన్: కొత్త పేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎల్.విజయలక్ష్మణ్ గురువారం తెలిపారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

తెనాలిరూరల్: సీనియర్ ఎంపీసీ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి 990 మార్కులు సాధించినట్టు ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల తెనాలి బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తమ కళాశాల రెండో స్థానంలో నిలిచిందన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలోనూ 465 మార్కులు తమ విద్యార్థి సాధించారని తెలిపారు. అలానే తెనాలి శ్రీచైతన్య కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 988 మార్కులు, జూనియర్ ఇంటర్‌లో 464 మార్కులను తమ విద్యార్థులు సాధించినట్టు అధ్యాపకులు తెలిపారు.

పొజిషన్ ఐడీలతో లాగిన్ అవ్వాలి

తెనాలిరూరల్:మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ పొజిషన్ ఐడీలతో లాగిన్ అయ్యి.. జీతాలు ఆన్‌లైన్ చేయాలని ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎంఈఓ గురువారం సమావేశమయ్యారు. మున్సిపల్ పాఠశాలల పరిపాలన బాధ్యతలను పాఠశాల విద్యా శాఖకు అప్పగించిన నేపథ్యంలో ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఉన్న జీతాలు చెల్లింపు.. ఇకపై మండల విద్యాశాఖ అధికారులకు బదిలీ అయ్యిందని తెలిపారు. ఎంఈవోగా పాఠశాలల పనితీరుపై పర్యవేక్షణతో పాటు డీడీఓగా జీతాల చెల్లింపు బాధ్యత తమపై ఉందన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ పొజిషన్ ఐడీలతో లాగిన్ అవ్వాలన్నారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కొల్లిపర: సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. హాస్పిటల్ రికార్డులను పరిశీలించి , వైద్యం ఎలా చేస్తున్నారు.. అన్న విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యుడు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మట్కా, పేకాట నిర్వహిస్తే జైలుకే

కొల్లిపర: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే జైలుకు పంపుతామని ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు, హన్‌మాన్ పాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పోతురాజు, రైటర్ శ్యామ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ తాతారావు , కానిస్టేబుల్ కూర్మారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

పిట్టలవానిపాలెం: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దారు కవిత పేర్కొన్నారు. మంతెనవారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో ఒక రోజు గ్రామ సచివాలయాన్ని, పాఠశాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల హాజరు, అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రధాన రహదారిలో పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని సర్పంచ్ దారా రవికిరణ్మయి గురువారం తెలిపారు. అద్దేపల్లి, అల్లూరు కాల్వ కట్ట, కూరగాయల మార్కెట్ పరిధిలోని రక్షిత తాగునీటి సరఫరా పథకాల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న ప్రాంతాలకు ఈ అంతరాయం కలుగుతుందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం తాగునీరు సరఫరా యథావిధిగా జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

హరికథ భాగవతారిణి రంగమణికి సన్మానం



రంగమణిని సన్మానిస్తున్న సుధామాధవి, కమల తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం నిలువు దోపిడి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం యమగోల చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారిణి, హరికథ భాగవతారిణి పరాంకుశం రంగమణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జొన్నకూటి సుధామాధవి, పోకూరి కమల, దేవరపల్లి భవాని, లక్ష్మీజ్యోతి, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబశివరావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, పినపాటి రవీంద్ర, నరసయ్య, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, వేములపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవనాల్లో కార్పొరేట్ విద్యా సంస్థలు



మాట్లాడుతున్న పాశం వెంకటేష్

తెనాలి: విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలను సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం తెనాలి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, కార్యదర్శి బదెల నాసర్‌జీ మాట్లాడారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు పాటించకుండా అనుమతులు లేని భవనాల్లో తరగతులు నడుపుతున్నాయని విమర్శించారు. వేసవి సెలవుల్లోనూ తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్టు చెప్పారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు విద్యా సంస్థలను తనిఖీ చేసి, అనుమతులు లేని భవనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్‌ను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ తెనాలి కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షుడు తలతోటి శ్రీను, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ



రైతులకు రుణాలు గురించి వివరిస్తున్న మేనేజర్ బాజీబాబా

కొల్లిపర: కో–ఆపరేటివ్ బ్యాంకులో ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ ఇస్తున్నట్లు కొల్లిపర సొసైటీ బ్రాంచి మేనేజర్ షేక్ బాజీబాబా తెలిపారు. గురువారం స్థానిక సొసైటీ బ్యాంకులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను గడువు లోపు చెల్లిస్తే తక్కువ వడ్డీ, మరలా అధిక రుణం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు దీర్ఘకాలిక రుణాలు కింద రూ.40కోట్లు , స్వల్ప కాలిక రుణాలు రూ.20కోట్లు, ఇతర రుణాలు రూ.30 కోట్లు ఇవ్వటం జరిగిందన్నారు. ఇవి కాకుండా రైతులకు సబ్సిడీతో 8 ట్రాక్టర్లను ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి రైతు బ్యాంకు సేవలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ టి.ప్రవీణ్, బ్యాంకు సిబ్బంది కృషి పవన్, రైతులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లతో ప్రజలకు వైద్య సేవలు చేరువ



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, పక్కన వైద్యాధికారులు

నగరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బాపట్ల జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పీహెచ్‌సీ సిబ్బందికి మొబైల్ యాప్‌లపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. మొబైల్ యాప్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయన్నారు. ఏఎన్ఎం ఏపీ హెల్త్, ఎన్‌సీడీ, సీడీ, ఎనేమియా ముక్త్‌భారత్, హెచ్‌ఎంఐఎస్, వెక్టార్ హైజీన్, ఫ్రైడే డ్రైడే, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వంటి యాప్‌ల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్‌లపై ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఎం, హెచ్ఎస్‌లకు శిక్షణనిచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి, చినమట్లపూడి, కావూరు, కనగాల, కూచినపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు భవానిశ్రీ , తులసి రాజేశ్వరి, శ్రీలత, సీతాకుమారి, ఉషారాణి, గణాంకాధికారి పి.వేణు, సీహెచ్ఓ బాబురావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు కాంగ్రెస్ నేతల నివాళి



సభలో మాట్లాడుతున్న పఠాన్ రాజేష్

బాపట్ల అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో గురువారం సంస్మరణ సభ నిర్వహించారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మాట్లాడారు. ప్రజల భద్రతకు భరోసానిస్తూ అంకితభావంతో పనిచేసే పోలీసుల సేవలు మరువలేనివన్నారు. పోలీసులను అమానుషంగా బలితీసుకున్న నక్సలైట్ల చర్యను ఖండించారు. అమరవీరులైన పోలీసులకు సంతాపాన్ని ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కట్ట లాజర్, పీసీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు ఎస్వీఆర్ కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, జిల్లా కార్యదర్శి నళిని, నాయకులు దోనేపూడి రవి, తాజుద్దీన్, ల్యాబ్ చిన్ని, యాసీన్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం రుచి చూస్తున్న ప్రత్యేకాధికారి విలియమ్స్

రేపల్లె రూరల్: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి విలియమ్స్ అన్నారు. బేతపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది అధిక శాతం చిన్నారులు పేదవారేనని, విద్యతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. నాణ్యత లోపిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.